కథా నిలయం
శ్రీకాకుళం

# తల్లి ప్రాణం

పెళ్లీడు వచ్చిన పిల్ల విషయంలో – ఆడవలసిన అబద్ధాలన్నీ ఆడినా మా సుశీ వివాహం కాలేదు. సంవత్సరం నుంచి ప్రయత్నం చేసినా కూడా.

దానికి పెండ్లి కాకపోవడానికి కారణం అది నల్లగా ఉండటమేనని ఎవరైనా చూచాయాగా అన్నారా మా ఆవిడ ఎగిరిపడేది.

"మా అమ్మాయికేమండి? బంగారపు తల్లి! నల్లరూపు అయితే మట్టుకు ఏం? ఎట్టగా బుర్రగా ఉండగానేసరా! ఏమిటి, ముఖాన కళాకాంతులు ఉండవద్దూ! మా చిట్టితల్లిని చూడండి. మరి వాళ్ళ అమ్మాయిని చూడండి. మీకే తెలుస్తుంది! అదీ కాక....

మా అమ్మాయి పనిపాటలు చక్కగా చేస్తుంది. పెద్దా చిన్నా వ్యత్యాసం తెలుసు, మాట, మర్యాద తెలుసు ఇంకేమి కావాలండీ ఆడదానికి."

ఇలాగ మా ఆవిడ అనేది.

నిజం సంగతి ఏమిటీ అంటే మా సుశీ ఇవతల చెంబు అవతలపెట్టదు. అదేమిటే అంటే గయ్యిమని లేస్తుంది కూడాను. తల్లితో ఎప్పుడూ పోట్లాడుతునే ఉంటుంది.

మా కాంతం ఇతరులతో చెప్పటం మటుకు, "మా పిల్లకు నోట్లో నాలిక లేదమ్మా! ఎవ్వరేమన్నా నోరెత్తదు ఎట్లా బ్రతుకుతుందో" అని చెపుతుంది.

పిల్లకు పెండ్లి కావటానికి ఆవిడ చేయవలసిన ప్రయత్నం అంతా చేస్తునే ఉంది. మా బంధుగులు అందరూ కూడా "ఆ పిల్లకేం నిక్షేపంలాంటి పిల్ల. బుద్ధిమంతురాలు. కుటుంబం కూడా చాలా సాంప్రదాయం గల కుటుంబం" అని అనుకొంటున్నారు.

ఇల్లాగ మంచి పేరు వచ్చినా మా అమ్మాయికి క్రిందటి సంవత్సరం ఎంత ప్రయత్నించినా పెండ్లి కాలేదు. దానికి కొన్ని కారణాలు ఉన్నయి.

## - 2 -

మొదటి సంగతి ఏమిటీ అంటే పిల్లకు చాలా చిన్న వయస్సు అనీ యింకా రెండు మూడేండ్లు ఉంచుదామనీ నేను అనుకొని గట్టి ప్రయత్నం చేయలేదు. ఆవిడ కేమో దానికి ఈ చిన్నతనంలోనే మూడు ముళ్ళు వేయిద్దామని పట్టుదల....ఈ విషయంలో మా యిద్దరికీ చాలా ఘర్షణలు జరిగినవి.

పిల్ల పెద్దదయితే తనకు అచ్చట్లు ముచ్చట్లు జరగవని ఆవిడ అంటుంది. నీ సరదాలు తీరేందుకు కాదు పిల్లకు పెండ్లి చేయటం, అని నేను అంటాను. దాని మీద పోట్లాట.

అసలు ఆవిడ పట్టుదల ఏమిటీ అంటే, తనకు పన్నెండో ఏట పెండ్లి అయిందట. అందుకని తన కూతురు వివాహం కూడా పన్నెండో ఏటనే జరగాలంటుంది. ఇది ఆవిడ మొండి వాదన. నేను ఒప్పుకోలేదు. పోట్లాట.

"బంతువాడించటం, గంధం పూయించటం ఈ సరదాలన్నీ చిన్నతనంలో జరిగితే బాగుంటాయి గాని, పెద్ద అయిన తరువాత ఏమి బాగుంటయి అండీ?" అన్నది ఆవిడ.

"ఏమి? ఎందుకు బాగుండదూ, పెద్దవాళ్ళు మట్టుకు గంధం పూయకూడదా?" అన్నాను నేను.

కాంతం పెదవి విరచి "ఎబ్బే! ఎద్దుల్లాగ ఉండి గంధాలు పూసుకోవటం ఏం బాగుంటుందండీ?" అన్నది.

తరువాత కాస్త సిగ్గుపడుతూ తలవంచుకొని అన్నది, "మన పెండ్లికి నేను పన్నెండు ఏండ్లదాన్ని, మీకూ చిన్నతనమే. నా బుగ్గ మీద మీరు గంధం చిలకరించారు. ఎంత ముచ్చటగా ఉంది. జ్ఞాపకం లేదూ?"

"లేకేమీ? అదీ జ్ఞాపకం ఉంది. నీవు గంధం పూస్తూ పూస్తూ నా చెంప మీద చిటుక్కు మనిపించటమూ జ్ఞాపకం ఉంది!" అన్నాను నేను కాస్త ఎత్తిపొడుస్తూ.

"అల్లాగ చెయ్యబట్టే మీరు ఈ మాత్రం అయినా చెప్పుచేతలలో ఉన్నారు" అన్నది ఆవిడ.

"అమ్మాయి చేత కూడా అల్లాగ చేయిద్దామనా నీ ఉద్దేశం?"

"అల్లాగే అనుకోండి పోనీ, అందులో తప్పు ఏముందీ?" అని ఆవిడ నవ్వింది.

ఆవిడ ఎన్ని చెప్పినా నాకు మటుకు పిల్లకు అంత చిన్నతనంలో వివాహం చెయ్యటం బొత్తుగా యిష్టం లేకపోయింది. అందుకనే మరో రోజున గట్టిగా వాదించాను ఆవిడతో. మొగుడంటే ఏమిటో తెలియని వయస్సులో పెండ్లి చేయకూడదని.

ఆ మాట మీద ఆవిడ ఎత్తుకొన్నది. "ఏమిటండీ తెలిసేది? అంత తెలిసేదాకా వస్తే దానికి పెండ్లి మీరు చేసేదేమిటి! అదే చేసుకొంటుంది" అన్నది ఆవిడ.

"పోనీ! చేసుకోనీ అందులో తప్పు ఏమీ లేదు" అన్నాను నేను.

కాంతం వింతగా చూస్తూ "అదేమిటండీ అల్లా అంటారు? మన మేమన్నా కిరస్తాని వాళ్ళమా? ఇష్టం వచ్చిన వాణ్ణి చేసుకో నియ్యటానికి? ఛీ ఛీ అల్లా ఎప్పుడూ అనబోకండి" అని విసుక్కున్నది.

నేనూ విసుక్కున్నాను. పెండ్లి అంటే ఏమిటో మొగుడంటే ఏమిటో, తెలియనక్కరలేదా?" అని.

కాంతం కచ్చితంగా చెప్పేసింది. "ఏమీ తెలియనక్కరలేదు. నాకు తెలిసిందీ మొగుడు అంటే ఏమిటో! ఏమిటండీ మీ దంతానూ! మొగుడంటే తెలియటం ఏమిటి నా బొంద! తెలియక ఏం జేస్తుందండీ? మెళ్ళో పుస్తె గట్టిన వాడు మొగుడు! అవ్వ! ఆ సంగతి తెలియక పోతుందనే మీ భయం?"

నాకు కాస్త చిరాకు వేసింది. "పుస్తె గట్టిన వాడు మొగుడై కూర్చుంటున్నాడని నాకూ తెలుసు. కాస్త ప్రేమలు ఏర్పడ్డతరువాత మొగుడు కావటం మంచిది. అదీ నేను అనటం!" అన్నాను.

ఈ మాటలు విని కాంతం పకపకా నవ్వి అన్నదే, నేను వట్టి తెలివితక్కువ మాట అన్నట్లుగా చూస్తూ "మొగుణ్ణి ప్రేమించాలని ఆడదానికి ఒకరు చెప్పాలా? చూడండి. అది ఎవ్వరూ చెప్పనక్కరలేదు. అదే పుట్టుకొస్తుంది. బావిలో జల ఊరుతుంది చూశారూ అల్లాగ ఆడదాని హృదయంలో జలలు పుడతాయి."

ఈ మొండి వాదన చూచి వళ్ళు మండి నేనన్నాను "అది సరే, ముందుగా

ప్రేమించి, ప్రేమించిన వాణ్ణి చేసుకోవాలె. అది నవీన పద్ధతి."

కాంతం అసహ్యించుకొని "ఛీ ఛీ పెండ్లి కాక పూర్వం ఎవ్వరినీ ప్రేమించకూడదండీ. అది మహాపాపం. నా పిల్ల అల్లాంటి అభాగ్యపు పని ఎప్పుడూ చెయ్యదు. తెలిసిందాండి" అని స్పష్టంగా చెప్పింది.

ఇల్లాగ వాదనలు చాలాసార్లు జరిగిన తరువాత, ఇక ఆవిడ పోరు పడలేక పిల్లకు పన్నెండో ఏటే పెండ్లి చేద్దామని నిశ్చయించాను.

– 3 –

ఈ నిశ్చయానికి వచ్చిన తరువాత కూడా పెండ్లి కాక పోవటానికి కారణం నా అశ్రద్ధ. మా చెల్లెలు కొడుక్కు ఇద్దామని నేను మొదటినుంచీ అనుకొంటున్నాను. అయిన సంబంధం అనీ, ఊళ్ళో సంబంధం అనీ ఆశపడ్డాను. మా చెల్లెలు మా వూళ్ళోనే ఇంకొక పేటలో ఉంది వాళ్ళకు పెద్ద ఆస్తిపాస్తులు లేకపోయినా తిండికి లోటు లేకుండా జరిగే ఏర్పాటు ఉంది. మా మేనల్లుడు పేరు శ్రీనివాసరావు. 'సీను' అని పిలుస్తాము. మా అమ్మాయి కంటే ఓ చాయ మెఱుగు. స్కూలు ఫైనలు చదువుతున్నాడు. పిల్లను ఈడు వచ్చిన తరువాత మా సీనుకు ఇచ్చి ముడిపెడదామని అనుకొని వేరే సంబంధం విచారించకుండా ధైర్యంగా ఊరుకొన్నాను.

అదీకాక ఈ విషయం మా బావగారితో అప్పుడప్పుడు హెచ్చరిస్తూ ఉండేవాడిని. ఆయన అనే వాడు "నాదేమి ఉందోయి. మీ చెల్లెలు యిష్టం. మీ ఇష్టం. నేనేమీ కాదంటానా?" అని.

నాకూ ధైర్యంగా ఉంటూ ఉండేది. మీ చెల్లెలు అభ్యంతర పెడుతుందని నేను కలలోనైనా అనుకోలేదు.

ఒకరోజున మాటల సందర్భంలో కాంతం "అమ్మాయిని సీనుకు ఇయ్యటం పడదండీ. ఎందుకూ లేనిపోని ఆశలు పెట్టుకొని కూర్చోటం! ఎక్కడైనా చూడండి" అని చెప్పేదాకా నాకు ఈ విషయం తెలియదు.

"మా చెల్లెలు సుశీని తన కొడుక్కు ఎందుకు చేసుకోదు? మన మీద ఏమన్నా కోపం వచ్చిందా?" అని అడిగాను ఆ మాట మీద.

కాంతం చెప్పుకొచ్చింది “మా సుశీ బారసాల రోజునే ఆవిడ అన్నదట మా చెల్లెలుతో “వదినా, దీనిని నీ కొడుక్కు చేసుకోవమ్మా” అని.

మా చెల్లెలు ఎందుకన్నదో మరి. మూతీ ముక్కూ విరిచి అన్నదట. “నేనే చేసుకోను వదినా, చేసుకోక చేసుకోక ఈ నల్లపిల్లనే చేసుకోవాలా?” అని.

నీ కూతురు నల్లనిది అంటే మా కాంతానికి చాలా కోపం. అందుచేత ఆవిడకు మా చెల్లెలుపై కోపం వచ్చింది. వచ్చి అన్నదట, ‘నా పిల్ల నల్లనిదా? నీ కొడుకే మహా ఎఱ్ఱటివాడు కామాలు! అంత నల్లని పిల్లను నీవు చేసుకోనే వద్దులే. నా కూతురుకు మొగుడు దొరక్క పోయినపుడు చూద్దాం లే” అని.

ఈ మాటలు కాస్త కష్టంగానే అన్నది. మా చెల్లెలూ ఏదో అన్నది మొత్తం మీద ఇద్దరూ మాటామాటా అనుకొన్నారు. ఇది ఎప్పుడో జరిగిన సంగతి. అయినా కాంతం ఈ విషయం మరిచిపోలేదు. దాని తరువాతకూడా మా కాంతం సుశీని సీనుకు చేసుకోవదినా అని అంటే, మా చెల్లెలు ఏమంత ఉత్సాహం కనపరచక ఊరుకున్నదట.

చివరకు మా ఆవిడ ఒక్క మాట అన్నది : “అంత యిష్టం లేకపోతే పోనీయండి. ఏం చేస్తాం. కాళ్ళా వేళ్ళా బడి చేసుకోమని బ్రతిమిలాడుతామా ఏమిటి? దానికి ఎక్కడ రాసిపెట్టి ఉందో అక్కడ అవుతుంది.”

ఈ మాటలు వినేసరికి నా గుండెల్లా రాయి పడ్డది. పరాయి సంబంధం నేనేమి తేగలను?

“చూడూ కాంతం, పన్నెండు ఏండ్లనాటి విషయం మనస్సులో ఉంచుకొని నిక్షేపంలాంటి మేనరికం వదులుకోటం నా కేమీ ఇష్టం లేదు. పరాయి సంబంధాలు ఊరికే వస్తాయా? వేలకు వేలు పొయ్యాలె, ఎక్కడ నుంచి తెచ్చేది?” అని అడిగాను.

“మీరే చేస్తున్నారా పెండ్లి : ఎవ్వరూ చెయ్యటం లేదా? ఎక్కడ నుంచి తెచ్చేదంటే నేనేం చెప్పేదండీ! రంగయ్య గారు మొన్న వాళ్ల అమ్మాయికి రెండు వేలు కట్నం యిచ్చి, పెండ్లి చేశాడా లేదా-?” అన్నది కాంతం కోపంగా.

“రంగయ్య ఇల్లు అమ్మి చేశాడు” అన్నాను నేను.

"మీరు కూడా ఏదైనా అమ్మండీ" అన్నది కాంతం, విసుగ్గా.

"ఆ, అల్లాగే పిల్లకు మంచి సంబంధం కావాలే. కట్నం ఇస్తేనే గాని మంచి సంబంధాలు రావు. కట్నం ఇయ్యటానికి డబ్బు లేకపోతే ఏదైనా అమ్మటానికి నేను సిద్ధంగా ఉన్నాను కాని, ఏది అమ్మాలో తెలియటం లేదు. చూస్తూ చూస్తూ మనం అద్దెకున్న, ఈ పరాయి కొంప ఎల్లా అమ్మేదా అని చూస్తున్నాను" అన్నాను నేను.

"ఏమి అమ్ముతారో మీ ఇష్టం. పిల్లకు మట్టుకు వైశాఖ మాసంలో వివాహం చెయ్యకతప్పదు" అని కచ్చితంగా చెప్పి వెళ్ళిపోయింది.

**- 4 -**

నా స్థితిలో ఉన్న గృహస్తు. మేనరికం వదులుకొని కట్నాలు పోసి, పరాయిసంబంధం తేవాలని అనుకోటం చాలా తెలివితక్కువ పని. అయినా నేను కూడా ప్రయత్నం చేసి చూద్దామని మా చెల్లెలు దగ్గర సుశీ వివాహ విషయం ఎత్తాను. మా కాంతం అన్న మాట నిజమే. మా చెల్లెలు ఉత్సాహంగా మాట్లాడలేదు.

"ఎందుకులే అన్నయ్యా, అందరికీ ఇష్టమై, మనస్సులు కలిస్తే చేసుకోవాలె కాని ఒకరికి ఇష్టమూ ఇంకొకరికి అయిష్టమూ అయితే ఎందుకు చెప్పు" అన్నది.

కాంతానిది ఏమీ లేదనీ, దాని మాటలు పట్టుకొని కూర్చోకూడదనీ, అది వట్టి తెలివితక్కువ మనిషి అనీ ఇల్లాగ ఏవో చెప్పాను గాని మా చెల్లెలుకు ఏమీ తృప్తి కలుగలేదు.

దాని తరువాత వాళ్ళూ, వాళ్ళూ చెప్పిన సంగతుల వల్ల అసలు విషయం బైటపడ్డది.

మాట సామెతగా సుశీని నీ కొడుక్కు చేసుకో వదినా అని అంటుంది గాని గట్టిగా అనలేదు అని మా చెల్లెలుకు కాంతంపైన కోపం.

"ఇంకా ఏం గట్టిగా అనేది. నా బొంద. ఎన్ని సార్లు అడిగినా, ఆ మీ సుశీని మా అబ్బాయికి ఎందుకిస్తావు లేవమ్మా? దాని కే జమీందారు వస్తాడో, అనో 'అమ్మా, సుశీని చేసుకొంటే అది సరిగ్గా కాపరం చేస్తుందమ్మా, మొగుణ్ణి వంగదీసి కొట్టేలాగుంది' అనో అంటుంది గాని సరే అది నోటితో అనదండి! నేను ఏం జేసేదమ్మా!" అని

కాంతం అంటుంది.

ఇంతకూ కాంతం, మా చెల్లెలు గారి యింటికి వెళ్ళి కూర్చొని, వదినా నా కూతుర్ని నీ కొడుక్కు చేసుకోమని అడిగి, కట్నం ఇంత యిస్తాము. ఇల్లాంటి లాంఛనాలు జరుపుతాము అని చెప్పలేదని మా చెల్లెలుకు కోపం.

"పరాయి సంబంధం కాదాయె. కట్నం కానుకా ఇంత అని ముందుగా నిర్ణయించుకొంటానికి! మా సరదా కొద్దీ మేము ఇస్తాము. అన్నీ చెప్పాలా ఏమిటి, ఈవిడగారికి ముందుగా. అసలు చేసుకొంటాననే అనదాయె ఏమిటా శాణీతనము" అంటుంది మా కాంతం.

ఇవన్నీ మనస్సులో ఆలోచనలే. బయటికి ఏమీ అనుకో లేదు. కాని కోపాలు తాపాలు లోపల లోపలే వృద్ధి పొందినవి.

చివరకు ఎంతవరకు వచ్చింది అంటే, "మా వదిన బ్రతిమిలాడితే గాని నేను సుశీని నా కొడుక్కు చేసుకోను, ఎందుకు బ్రతిమిలాడదో చూస్తాను. అంతగా బ్రతిమిలాడకపోతే పోనీ, నా కొడుక్కు పెండ్లి కాక పోతుందా?" అని అనుకొన్నది మా చెల్లెలు.

"ఊళ్ళో సంబంధం గదా. ఏదో మేనరికం అని చూస్తుంటే, ఈవిడగారు నిచ్చెనెక్కి కూర్చున్నదే!

నేను వెళ్ళి బ్రతిమిలాడి, నా కూతుర్ని చేసుకో తల్లీ అని ప్రాధేయపడాల కామాలు, నేనేమీ పడను. మా కూతురుకు పెండ్లి కాకపోతే చూద్దాములే," ఇల్లాగ కాంతం అనుకున్నది.

## - 5 -

సుశీకి సంబంధాలు విచారించడం సాగించాము. బాపట్లలో ఒక పిల్లవాణ్ణి చూచి వచ్చాను. పిల్లవాడు అందంగానే ఉన్నాడు. అయితే చదువూ లేదు. ఆస్తీ లేదు. కట్నం మట్టుకు వెయ్యి నూటపదహార్లు కావాలన్నారు. ఈ సంబంధం విషయమై కాంతం విని తల తిప్పి 'ఆహ, ఇది లాభం లేదు. ఇంకెక్కడైనా చూడండి' అన్నది.

తరువాత రాజమండ్రిలో ఒక సంబంధం కనబడ్డది. ఆ కుర్రవాడు స్కూలు

పైనలు చదువుతున్నాడు. ఇక మరేమీ ఆస్తి లేదు. నల్లగా ఉన్నాడు. రెండు వేలకు పైమాటే. రెండు వేల కట్నం ఎక్కడ నుంచి తెచ్చి ఇస్తాము! అయినా ఏం జూచి ఇస్తాము!

ఎన్ని చోట్ల చూచినా మా మనస్సుకు నచ్చిన సంబంధం కనపడలేదు. కాస్త ఆస్తి ఉన్న వాడు మూడువేలిస్తావా, నాలుగువేలు ఇస్తావా? అని అడగడం సాగించాడు. ఆస్తి ఉంటే చదువు ఉండదు. చదువు ఉంటే ఆస్తి ఉండదు. ఈ రెండు ఉంటే రూపము ఉండదు.

ఇంతకూ ఇందులో ఒక్కడూ, మా సీను కంటె మెఱుగు కాదు. పైగా కట్నాలు కానుకలు బోలెడు. సంబంధాలు వెతకలేక విసుగెత్తింది. ఒక రోజున కాంతంతో అన్నాను ...

"చూశావా కాంతం, ఎన్ని విధాల చూచినా మన సీను సంబంధమే నయం అనిపిస్తున్నది!"

"నిజమే. ఆ సంగతీ నేను గ్రహిస్తూనే ఉన్నాను. అయితే ఏం జేస్తాం. వదిన అల్లాగ బిగిసి కూర్చుంటే!"

"కాంతం, నేను ఒక మాట చెబుతాను విను. మనం ఆడపిల్ల గలవాళ్ళం. కాస్త తగ్గే ఉండాలె!"

"అయితే ఏం జేయమంటారు?"

"మా చెల్లెలునే బ్రతిమిలాడు."

"నాకేం కర్మం అండి, కాళ్ళా వేళ్ళ బడి బ్రతిమిలాడిందాకా?" అన్నది కాంతం.

సంబంధాలు దొరక్క, నేను పడుతూ ఉన్న అవస్థలన్నీ చూస్తూ కూడా కాంతం ఇంకా అల్లాగ మాట్లాడటం చూస్తే నాకు ఒళ్ళు మండిపోయింది. అందుకని అన్నాను.

"నీవు బ్రతిమిలాడక తప్పదు" – అని.

"ఏం – ఎందుకు తప్పదూ?"

"ఎందుకు తప్పదా? ....ఆడపిల్లను కన్నావు కాబట్టి!"

"నేను వెళ్ళి ఇక ఆవిడను బ్రతిమిలాడనండీ - ఏమన్నా కానీ" - అన్నది కాంతం కోపంగా.

నేనూ కోపంగా ఉన్నాను.

"ఎవరి కోసం బ్రతిమిలాడుతావే! నీ కూతురికోసం! చూస్తానుగా, నీవే బ్రతిమాలుతావో నీ తల్లో జేజెమ్మ బ్రతిమిలాడుతుందో !" అని ఇల్లాగ. నాలుగు మాటలూ విసురుగా అని ఉత్తరీయం ఝాడించి పైనవేసుకొని బైటకు వెళ్ళిపోయాను.

**- 6 -**

నేను పరాయిగా సంబంధాలు చూస్తున్నట్లు తెలిసి, మా చెల్లెలు కూడా తన కొడుక్కూ ఆ నెలలోనే పెండ్లి చేయాలని గట్టి ప్రయత్నాలు సాగించింది. మా సుశీకి పెళ్ళి అయ్యే రోజునే తన కొడుక్కూ పెండ్లి కావాలట!

"నా కొడుక్కు పెండ్లి కాదనే అనుకొంది. కామాలు మా వదిన! చూస్తాను ఎందుకు కాదో!" ఇల్లాగ పంతాలు పలికిందట మా చెల్లెలు.

ఈ మాట నాకు చెపుతూ కాంతం అన్నది. "ఇదెక్కడి గోలండీ, నేను తన కొడుక్కు పెండ్లి కాదన్నానా?...తనే నా కూతురును ....నల్ల పిల్లని పేరు పెట్టి, చేసుకో నన్నది కాని! వదిన ఇల్లాగ అనడం ఏమన్నా బాగుందండీ. మీరే చెప్పండీ!"

ఇల్లా అని కాంతం విచారంగా చూచింది.

కాంతం మనస్సు కష్టపడ్డట్టు తెలుస్తునే ఉంది. నాకూ విచారం కలిగింది. కాని ఏమి చేసేది. మాట్లాడక ఊరుకొన్నాను.

ఆ తరువాత మా చెల్లెలు తన కుమారుడికి గొప్ప సంబంధం తేవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు కబుర్లు వస్తూ ఉండేవి. కట్నాలు కూడా యిస్తామని కొందరు వస్తున్నట్లు తెలిసింది. పోనీ మనదేమి పోయింది అని అనుకొన్నాము. కాని మాకు మనస్సులో ఏదో కష్టంగా ఉండేది. కుర్రవాడు చదివింది స్కూలు ఫైనలే గదా ఏం జూచి యిస్తున్నారు ఇంత డబ్బు! అని మా సందేహం.

అసలు వాళ్ళు ఎందుకు రావాలె? వారు రాకపోయినట్లయితే మా చెల్లెలు మా పిల్లను చేసుకొంటానికే ఆశపడేది. వీళ్ళంతా రాబట్టే మా చెల్లెలుకు వీళ్ళు పిల్లను యిస్తే ఎంత, ఇయ్యకపోతే ఎంత అనే ధీమా కలిగింది. ఇల్లా అనుకొని మేము ఆ వచ్చిన వాళ్ళను అసహ్యించుకోటం మొదలు పెట్టాము.

"వస్తారు - యిక్కడ ఏదో ఉందని వస్తారు. అసలు సంగతి తెలిస్తే వచ్చిన దారినే వెడతారు" అని కాంతం తనలో తాను అనుకొని తృప్తి పడుతూ ఉండేది. అంతేకాని నిజంగా లగ్నాలు పెట్టుకోపోతున్నారనీ, కొంప లంటుకుపోతున్నాయి అనీ మాకు నాంచారమ్మ గారు చెప్పిందాకా తెలియనే తెలియదు.

ఆవిడ వచ్చి "కాంతమ్మ, కాంతమ్మ మీ వదిన భలే లాటుకొదుతున్నదే మీ మేనల్లుడికి కర్నూలు నుంచి ఓ మంచి సంబంధం వచ్చింది. వెయ్యిన్నూటపదహార్లు కట్నంట. ఆడపడుచుకు ఇవ్వాల్సింది, ఇతర లాంఛనాలు కాక"....అని చెప్పింది.

ఈ మాట వినేసరికి కాంతం గుండె దడ దడ కొట్టుకొన్నది. ఈ కుర్రవాడి దగ్గర ఏదో ఆకర్షణ, లేకపోతే పైవాళ్ళు వచ్చి ఇంత డబ్బు ఎందుకిస్తానంటారు?

చూస్తూ ఉండగానే వీడిని గద్ద తన్నుకు పోయినట్లు ఎవరో తన్నుకుపోయేలా గున్నారు. అయిన సంబంధాన్ని ఇల్లాగ పరాయివాళ్ళకు అప్పజెప్పటం ఏమంత మంచిపని కాదని కాంతానికి తోచింది.

కాంతం నాంచారమ్మతో అన్నది - "సంతోషమే గాని అక్కయ్యా. అయితే ఏం జూచి ఇస్తున్నారమ్మా ఇంతలేసి కట్నాలు?"

"ఏం చూడాలే కాంతం! ఈ కాలంలో మొగపిల్లలు దొరుకుతున్నారా అసలు. ఇంత వెర్రి బాగులదానివేమే అమ్మాయి నీవు! అందులో కాస్త చదువుకూడా ఉందాయె. ఇంకేం కావాలె అమ్మాయి. వెయ్యేమిటేవ్! ఎంతైనా యిస్తారనుకో" - అన్నది నాంచారమ్మగారు.

ఈ మాటలు కాంతం మనస్సుపైన పని చేసినయి. తనకేదో అన్యాయం జరుగుతున్నట్లు తోచింది. ఇంకో నిమిషం ఆలోచించిన మీదట ఆమెకు తోచింది. తనే తనకు అన్యాయం చేసుకొంటున్నట్లు.

ఇంతలోకే నాంచారమ్మ అన్నది! అమ్మాయి నిన్ను ఒక మాట అడుగుతాను. ఏమీ అనుకోకేం అమ్మా నీ కూతురుండగా మీ వదినె ఇల్లాగ పరాయి సంబంధం చూస్తున్నది ఎందుచేతనే అమ్మాయి? ...నీవు మటుకు చూస్తూ ఊరుకుంటావేం, అయిన సంబంధం అల్లాగ పోతుంటే?"

కాస్త విచారంగా అన్నది . "అవును అక్కయ్యా, అయినసంబంధమే. అయితేమటుకు కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమిలాడిందాకా మనకేం ఖర్మ చెప్పు అక్కయ్యా. ఒకటి రెండుసార్లు అడిగితే ఏదో ముభావంగా ఊరుకొన్నది. 'సరే' అని నోటితో అనదమ్మా, ఆవిడ నోటి ముత్యాలన్నీ రాలిపోతయ్యనో ఏమిటో మరి!"

"నీవు గట్టిగా అడగలేదటగా?" అన్నది నాంచారమ్మ "ఇంకేం గట్టిమ్మా ఇంతకంటె ఏం గట్టిగా అడుగుతారమ్మా?" అన్నది కాంతం.

"అదిగాదే అమ్మాయ్, నేనొక మాట చెపుతాను విను. మన వాళ్ళను నలుగురినీ పిలిచి కూర్చోబెట్టి అందరి ఎదుటా అడుగు, చేసుకొంటావా అని. అప్పటికీ బెట్టుచేస్తుందీ పోనీ నలుగురూ దాన్నే అంటారు. ఎందుకు చెపుతున్నానో విను అమ్మాయి. మీ మేనల్లుడు ముఖాన రాజా కళ ఉందే కాంతమ్మా! నీవు కనిపెట్టావో లేదో – వాడు అదృష్టవంతుడు. సుశీని వాడికిస్తే ఇద్దరూ ఈడుజోడుగా చక్కగా ఉంటారు. అంతగా అయితే మీ వదినను బ్రతిమిలాడినా తప్పు లేదే అమ్మాయి!" అని నాంచారమ్మ సలహా చెప్పింది.

"ఆ! ఈవిడగారిని బ్రతిమిలాడుతానా ఏమిటీ! పోనిద్దూ ఈ మాత్రం సంబంధం దొరక్క పోతుందా ఏమిటీ?" అన్నది కాంతం బింకాన్ని వదలకుండా. అన్నదే కాని కాంతానికి మనస్సులో చాలా కష్టంగా ఉంది. వదినతో సంబంధం పోతున్నదే అని?

పరాయిగా యిస్తే ఎన్ని తిప్పలు ! వాళ్ళు ఎటువంటి వాళ్లు వస్తారో! వదినా మరదళ్ళు చిన్నప్పటినుంచీ కూడా ఎంతో స్నేహంగా ఉంటూ ఉండే వాళ్ళు. పిల్లవాడికి కాస్తో కూస్తో ఆస్తి ఉంది. అన్ని విధాల అనుకూలమైన ఈ సంబంధం పరాయగా పోతుంటే చూస్తూ ఊరుకోటం ఎల్లాగా అని కాంతం చాల పరితపించింది. కాని వదినెను బ్రతిమిలాడటానికి ఆమె మనస్సు ఒప్పుకోలేదు.

నేను సంబంధాల కోసం అన్వేషణ మాన లేదు. ఎన్నో సంబంధాలు చూశాను. కాని మనసుకు నచ్చిన సంబంధం ఒకటీ కుదరలేదు.

ఒకరోజున ఓ తమాషా జరిగింది. ఎవరో ఒకాయన ఇద్దరు ముగ్గురు బంధువులను వెంట పెట్టుకొని వచ్చాడు. మా అమ్మాయిని చూడటానికి. ఆయన ఒక జమీందారుడు కావలసినంత ఆస్తి ఉంది. గొప్ప సంపన్న కుటుంబం. నౌకర్లు చాకర్లు ఉన్నారు. కట్నం కూడ ఏమీ ఇయ్యనక్కరలేదన్నారు. కాని వయస్సు ముప్పది అయిదు అని చెప్పాడు. కాని, నలభైకి తక్కువ ఉండవు.

"వయస్సు కాస్త ఎక్కువైతే మట్టుకు ఏం? ఈ సంబంధం బాగుంది నాకు. ఆస్తి ఉంది. నా బాధ్యత తీరుతుంది. పిల్ల కూడా సుఖపడుతుంది" అన్నాను నేను.

కాంతం కళ్ళ నీళ్ళు తుడుచుకొని "పిల్లగొంతు కోస్తారా, చూడటానికి ఆశపడి. చాల్లే ఊరుకోండి. ఎవరైనా వింటే నవ్విపోతారు" అన్నది.

కాంతం అన్నట్లే అయింది. ఈ కొత్త పెండ్లి కొడుకును చూడటానికి చాలా మంది ఇరుగూ పొరుగూ వచ్చి నవ్వుకుంటూ వెళ్ళిపోయినారు.

ఆయన మా యింటి కొచ్చి వెళ్ళిన దగ్గర నుంచి ఊళ్ళో ఒక పుకారు పుట్టింది. ఫలానివారి అమ్మాయికి ముసలి మొగుడు దొరికాడని!

మా అమ్మాయి పక్క యింటికెడితే ఆ ఇంటావిడ ముక్కు మీద వేలు వేసుకొని అన్నదట – "చూశావుటమ్మా విపరీతం! ఈ పిల్లనేమిటి, ఆ ముసలోడి కియ్యటమేమిటి? ఎంత డబ్బుగల జమీందారుడు అయితే మట్టుకు! –

మా సుశీ ఏడుస్తూ ఇంటికొచ్చి తల్లితో చెప్పింది. కాంతం సుశీని దగ్గరకు తీసుకొని ఓదార్చి "నీకేం ఖర్మమే అమ్మా, ముసలి మొగుణ్ణి కట్టటానికి! రేపీపాటికి దొరను తీసుకొచ్చి జైమంటూ పెండ్లి చేయకపోతే చూడు!" అని అన్నదట.

ఆ రోజు నుంచీ కాంతం ప్రాణం తల్లడిల్లిపోయింది. సుశీకి ఎల్లాగ పెండ్లి అవుతుందా అని, సంబంధాలు చూస్తూనే ఉన్నాము. అది గాదని ఇదీ, ఇది కాదని అదీ!

మా మేనల్లుడు సీను ఒక రోజున మా యింటికి వచ్చాడు. అసలు వాడు

మా యింటికి ఎప్పుడూ వస్తూనే ఉండేవాడు. ఈ మధ్య రావటం లేదు గాని. నరసారావుపేట నుంచి మా అమ్మ వచ్చింది. కూతురూ కొడుకూ ఒక ఊళ్ళోనే ఉన్నాము. ముందు కూతురు ఇంటికి వెళ్ళింది. సాయంత్రానికి మా యింటికి వస్తుంది. ఆ సంగతి చెప్పటానికే మా సీను వచ్చాడు.

సీను "అత్తయ్యా అత్తయ్యా" అంటూ, వంట ఇంట్లోకే వెళ్ళి ఈ కబురు చెప్పాడు.

కాంతం పీట వేసి సీనును కూర్చోమని ఏమో మాటలలోకి దింపింది.

సీను ముఖం కళకళలాడుతూ అంచక్కా ఉండటం కాంతం ఈసారి మరీ వివరంగా చూచింది.

"ఛీ! పరాయిగా సంబంధం చూడటం ఏమిటి నిక్షేపంలాంటి మేనరికం ఉండగా!" అని ఆమె మనస్సులో అనుకొని ఉంటుంది.

కాంతం సీనుతో చాలాసేపు మాట్లాడింది, మాటల సందర్భములో అడిగింది "ఏం నాయనా నీకు సంబంధాలు వస్తున్నాయటగా, అంతా అనుకొంటున్నారు, నిజమేనా?

"ఎవరనుకుంటున్నారు అత్తయ్యా! మా అమ్మ, నాన్న అనుకోటం లేదే" అన్నాడు. ఎంత తెలివిగా అన్నాడు! ఎంత ఊహతో అన్నాడు! తనకు పరాయిసంబంధాలు వస్తున్నయి అంటే అత్తకు సంతోషంగా ఉండదని గ్రహించే అల్లా అని ఉంటాడు. కాంతం ఎంతో సంతోషించింది.

కాసేపు మాట్లాడిన తర్వాత సీను "కాసిని మంచినీళ్ళు యియ్యి అత్తయ్యా" అన్నాడు. అప్పుడు ఆవిడ మడికట్టుకొని ఉంది. అందుకని, సుశీని పిలిచి "బావకు మంచినీళ్ళు కావాలట తీసుకరావే అమ్మాయ్" అని చెప్పింది.

సుశీ గదిలోనే ఉండి పలికిసరే నన్నది. కాని ఎంత సేపటికీ రాలేదు.

అప్పుడు సీను అన్నాడు, "చూశావా అత్తయ్యా, సుశీకి ఎంత పొగరో, నీవు చెప్పి ఎంతసేపు అయింది ఇంత వరకు రాకపోయె! దీని పొగరు అణిచే ఉపాయం ఏమిటి అత్తయ్యా?"

కాంతం అన్నది, "నీవు పెండ్లి చేసుకొని దీని పొగరు అణచవోయ్ అల్లుడా" ఈ మాట మీద, "అట్లాకాదు అత్తయ్యా, దీన్ని అరవై ఏండ్ల ముసలాడి కిచ్చి పెండ్లి చేద్దాము. దాంతో దాని పొగరు చప్పగా అణుగుతుంది!" అన్నాడు అల్లుడు. అంతా నవ్వుకొన్నారు.

ఇంతలో సుశీ "తెచ్చానే అమ్మా, బావ పాపం ఎండలో వచ్చాడని చల్లని షర్బత్ చేసి తెచ్చానే" అంటూ వచ్చి గ్లాసు బావకు ఇచ్చి, చేతికి అతికివున్న నీళ్ళు అతని బుగ్గపైన చిలకరించింది.

మా మేనల్లుడు నవ్వుతూ,"చూశావా అత్తెయ్యా, సుశీ ఏం జేస్తున్నదో, నా మీద నీళ్ళు చల్లుతున్నది. దీన్ని నేను చేసుకోనమ్మా" అని చివుక్కున లేచి నవ్వుకుంటూ వెళ్ళిపోయినాడు.

కాంతం ఈ దృశ్యం చూచింది. ఆవిడకు కడుపు నిండిపోయింది. సుశీకి ఎవరు భర్త కావలసి ఉందో, ఆవిడ ఆ క్షణంలో నిర్ణయించుకో గలిగింది.

ఆ తరువాత కాంతం నా దగ్గరకొచ్చి ఇట్లా అన్నది, "చూడండి, మీరు ఏ సంబంధమూ చూడనక్కరలేదు. వేరే సంబంధం చూడాలని అనుకొని చాలా బుద్ధి తక్కువగా ప్రవర్తించాను. ఇప్పుడు అంతా తెలిసొచ్చింది. వదిన కాళ్ళమీద పడటానికి కూడా నాకేమీ అభ్యంతరం లేదు."

ఆ సాయంత్రమే మా అమ్మ వచ్చి ఇల్లా అన్నది, "నీవు పిల్లకు పరాయి సంబంధం చూస్తున్నావని తెలిసి నేను పరుగెత్తుకొని వచ్చాను. నీవు చేస్తున్న పని ఏమీ బాగుండలేదే కోడలా, చిన్నప్పటి నుండీ నేను అనుకొన్నాను. వీళ్లిద్దరికీ ముడిపెడదామని. నీవు పిల్లను పరాయిగా ఇస్తే నాకు చాలా కష్టంగా ఉంటుంది. ముసలి దాని మాట తీసివేయకు అమ్మా ఇటు కొడుకు, అటు కూతురు. వీళ్ళు ఇద్దరూ వియ్యం పొందితే నా హృదయం సంతోషిస్తుంది."

"నేను మటుకు కాదనాన్నునా అత్తయ్యా! వదినే చేసుకోనన్నది కాని" అన్నది కాంతం.

"నీవు గట్టిగా అడగలేదని అదంటుంది. ఎందుకే యిదంతా అమ్మాయ్.

ఇవ్వాళ సాయంత్రం రమ్మన్నాను. నీవు మళ్లీ నా ఎదుట అడుగు. ఏమంటుందో నేను చూస్తాను?" అన్నది మా అమ్మ.

ఆరోజు సాయంత్రం మా చెల్లెలు రావటంతోనే మా కాంతం ఎదురుగా వెళ్ళి కౌగలించుకొని, తీసికొచ్చి కూర్చోబెట్టి, చెయ్యి పట్టుకొని నీవు మా సుశీని చేసుకోక తప్పదు వదినా" అన్నది. కాంతం కళ్ళ నీళ్ళు కూడా పెట్టుకొన్నది.

ఈ మాటలు వింటూన్న మా అమ్మ సంతోషంతో పొంగిపోయింది. ఆవిడన్నది – "ఆ పిల్లవాడు ఒప్పుకొనేది ఏమి?" అని.

అయినా అడిగి తెలుసుకోటం మంచిదని అంతా అన్నారు. సుశీని ముస్తాబు చేసి తీసుకొచ్చి తీవాసిపైన కూర్చోబెట్టింది. దానికి ఎదురుగా సీనును కూర్చోమన్నాము.

ఒకరిని ఒకరు కాసేపు చూచుకొన్నారు. దాని తరువాత కాంతమే అడిగింది సీనును. "ఏం నాయనా! సుశీని చేసుకొంటావా?"

తప్పకుండా చేసుకొంటాడని మా అందరి నమ్మకం. ఊరికే లాంఛనంగా అడిగినా,

కాని సీను తల గిరా గిరా.త్రిప్పి 'నేను చేసుకోను' అని స్పష్టంగా చెప్పాడు.

మేమంతా నిర్ఘాంతపోయాము. కాంతం తెల్లపోయింది. ఇదేమిటి ఇల్లా అయిందేరా భగవంతుడా అనుకొన్నాము అంతా.

"ఎందుకు చేసుకోవురా?"

"పిల్ల అందంగా లేదా?"

"ఏంరా, ఎందుకు చేసుకోవు?"

అని అందరూ ఒక్కసారి ప్రశ్నలు వేశారు. వాడు ఏమీ మాట్లాడలేదు. బ్రతిమిలాడి అడగంగా చివరకు బైటపెట్టాడు. కారణం ఏమిటి అదీ?

సుశీని ముందు ముసలివాడికి ఇస్తామన్నామట! ముసలి వాడికి ఇస్తామన్న పిల్లను చేసుకోవడం తనకు తలవంపులట!

మా సీను చెల్లెలు ఒకతె ఉంది పదేండ్ల పిల్ల. భడవ. అది ఎగిరి గంతులేస్తూ

"చేసుకోకురా అన్నయ్యా. ఛీ ముసలాడికి ఇస్తానన్న పిల్లను నీవెట్లా చేసుకొంటావురా? ఎబ్బే! వద్దు" అనటం సాగించింది.

అక్కడ కూడిన పెద్దలంతా "నిజమే పెండ్లి కొడుకు పెట్టిన అభ్యంతరం సరియైనదే" అన్నారు.

అయితే ఒకటి చెప్పారు.

ముసలివాడికి ఇస్తానన్న. దోషం పోవటానికి అల్లుడికి, సైకిల్, రిస్టువాచీ కొని ఇచ్చేటట్లూ.

"మా వదినె ముసలివాడికి ఇస్తానన్న పిల్ల ఎబ్బే, దానిని చేసుకోవద్దురా అన్నయ్యా" అని అనకుండా ఉండేటందుకు ఆడబడుచుకు యాభై రూపాయలు.

ఈ రహస్యం ఎవ్వరితోనూ చెప్పగుండా గుట్టు చక్కంగా పెండ్లి చేసుకొని పొయ్యేందుకు వియ్యపురాలికి నూటపదహార్లూ ఇచ్చేలాగున పెద్దలందరూ ఏర్పాటు చేశారు. ఎట్లాగయితేనేం సుశీ పెండ్లి అప్పటికి నిశ్చయమైంది. తల్లి ప్రాణం సంతోషించింది.